సాక్షి కామారెడ్డి

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



పరిష్కారం చూపాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులకు పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



సౌత్ క్యాంపస్‌లో ధర్నా

విద్యార్థిని ఆత్మహత్య ఘటన నేపథ్యంలో తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో విద్యార్థులు ఆందోళనకు దిగారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /23.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు కాళేశ్వరంపై బీఆర్‌ఎస్ పీపీపీ

- జిల్లా కేంద్రంలో స్క్రీన్ ఏర్పాటు
- వీక్షించనున్న గులాబీ నేతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ భవన్ నుంచి హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్(పీపీపీ) ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు బీఆర్‌ఎస్ నేతలు జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇంటి వద్ద స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలు ఇందులో పాల్గొననున్నారు.

నేడు కామారెడ్డిలో దివ్యాంగుల గర్జన



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల గర్జన సదస్సు నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి తెలిపారు. సోమవారం ఏఎస్పీ చైతన్యరెడ్డిని కలిసి సదస్సుకు అనుమతి కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం సుజాత మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని దేవునిపల్లి లక్ష్మీదేవి గార్డెన్‌లో మధ్యాహ్నం ప్రారంభమయ్యే ఈ సదస్సుకు జిల్లాలోని దివ్యాంగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు హుస్సేన్, రాజ్యలక్ష్మి, అఫీజా, మంగమ్మ, దశరథం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

కామారెడ్డి టౌన్ : జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. 165 పదోన్నతులకుగాను 495 దరఖాస్తులు వచ్చాయి. 425 మంది ఉపాధ్యాయులు సోమవారం ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరయ్యారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యిందని డీఈవో రాజు తెలిపారు. మంగళవారం అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. ఉపాధ్యాయులు పదోన్నతుల తుది జాబితా 7వ తేదీన ప్రకటిస్తామని పేర్కొన్నారు.

తెయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆరతి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి మంజూరైన ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీహెచ్ ఆరతి నియమితులయ్యారు. వీసీ యాదగిరి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆరతి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఇకపై ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఏప్‌సెట్ మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ భారతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 11వ తేదీ వరకు కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

పట్టు పురుగుల పెంపకం లాభదాయకం

బీబీపేట: పట్టు పురుగుల పెంపకం లాభదాయకమని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి ఐలయ్య పేర్కొన్నారు. సోమవారం యాడారంలో నవీన్‌రావు అనే రైతు సాగు చేస్తున్న మల్బరీ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ సంప్రదాయ పంటలతో పోలిస్తే పట్టు పురుగుల పెంపకం లాభసాటిగా ఉంటుందన్నారు. పట్టు పరిశ్రమ ఏర్పాటు కోసం రైతులు ముందుకు రావాలని సూచించారు.

కటౌట్ల కలకలం!



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కటౌట్

జిల్లాకేంద్రంలో వెలసిన కటౌట్లు కాంగ్రెస్‌లో కలకలం సృష్టిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన తమ్ముడు కొండల్‌రెడ్డి ఫొటోలతో వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో షబ్బీర్ అలీతోపాటు స్థానిక నేతల పేర్లు, ఫొటోలు లేకపోవడంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

- కామారెడ్డిలో సీఎం, సీఎం తమ్ముడి ఫొటోలతో ఏర్పాటు
- స్థానిక నేత షబ్బీర్ ప్రమేయం లేకుండా పలు పరిణామాలు
- పార్టీ శ్రేణుల్లో అయోమయం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డి ఫొటోలతో కటౌట్లు ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రక్షాబంధన్, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.. కామారెడ్డి నియోజక వర్గం అని మాత్రమే ఆ కటౌట్లపై ఉంది. ఈ కటౌట్లు కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. అసలేం జరుగుతుందంటూ పార్టీ ముఖ్య నేతలకు ఫోన్లు చేసి అడుగుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి కామారెడ్డి నియోజక వర్గంలో షబ్బీర్ అలీ కీలక నేతగా ఉన్నారు. సుమారు నాలుగు దశాబ్దాల కాలంగా ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అంటే షబ్బీర్ అన్న పేరుంది. నియోజకవర్గంలో ఓడినా, గెలిచినా క్యాడర్‌ను కాపాడుకుంటూ వస్తున్నారు. 2014, 2018 ఎన్నికల్లో స్వల్ప ఓట్లతో ఓడిపోయిన షబ్బీర్.. 2023 ఎన్నికల్లో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. ఇక్కడ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పోటీ చేశారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చి గౌరవించారు. ఇప్పటికీ ఆయన కామారెడ్డి నియోజకవర్గంలో అన్నీ తానై నడిపిస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో జరుగుతున్న పరిణామాలు ఆయన అనుచరులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

చెక్ పెట్టేందుకేనా?

సుదీర్ఘ కాలంగా కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉంటూ వస్తున్న షబ్బీర్ అలీకి చెక్ పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని నేతలు భావిస్తున్నారు. ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు దానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. షబ్బీర్ అలీకి తెలియకుండానే పీసీసీ ప్రధాన కార్యదర్శిగా గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని నియమించడంతో పార్టీ శ్రేణులు అవాక్కయ్యాయి. తన నియోజకవర్గంలో తనకు తెలియకుండా పదవులు ఇవ్వడంపై షబ్బీర్ అలీ పార్టీ ముఖ్య నేతలపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇంతకాలం కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్‌లో ఎలాంటి గ్రూపు గొడవలు లేకుండా పార్టీని నడిపిస్తే.. ఇప్పుడు తనకు వ్యతిరేకంగా ఒక గ్రూపు తయారు చేయడాన్ని షబ్బీర్ జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో పార్టీలోకి వచ్చిన వ్యక్తికి పీసీసీలో పదవి ఇవ్వడం షబ్బీర్ వర్గానికి మింగుడు పడడం లేదు. ఇటీవల చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో షబ్బీర్ ఫొటోలు లేకపోవడంపై వారు ఆగ్రహంతో ఉన్నా రు. ఈ నేపథ్యంలోనే షబ్బీర్ అనుచరులు చంద్రశేఖర్‌రెడ్డిపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారు. అదే సమయంలో జిలెటిన్ స్టిక్స్ నిల్వ కేసులో పోలీసులు అర్ధరాత్రి సమయంలో గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసిన సంఘటన సంచలనం కలిగించింది. ఆయన బెయిల్‌పై విడుదలైన తర్వాత ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి తనపై కుట్ర పూరితంగా కేసు పెట్టి అరెస్టు చేయించారంటూ పరోక్షంగా షబ్బీర్‌అలీపై, ఆయన కుటుంబంపై విమర్శలు చేశారు. దీంతో వివాదం మరింత ముదిరింది.

చర్చనీయాంశంగా..

జిల్లా కేంద్రంలో సీఎం తమ్ముడి ఫొటోతో కటౌట్లు ఏర్పాటు కావడం చర్చనీయాంశమైంది. నియోజకవర్గంలో పార్టీతో పాటు ప్రభుత్వ వ్యవహారాలను చూస్తున్న షబ్బీర్ అలీకి తెలియకుండానే జరుగుతున్న పరిణామాలు పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయి. దీనిపై పలువురు నేతలు షబ్బీర్‌అలీతో పాటు పార్టీ ముఖ్య నేతలకు ఫోన్లు చేసి ఆరా తీశారని తెలిసింది. అసలు పార్టీలో ఏం జరుగుతోందని ప్రశ్నించినట్లు సమాచారం.

ఆయకట్టుకు సాగర్ నీరు



ఆయకట్టు రైతులతో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- నేటినుంచి విడుదల
- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : ప్రస్తుతం నెలకొన్న వర్షభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిజాంసాగర్ ఆయకట్టు కింద పంటలను కాపాడేందుకు ప్రాజెక్టునుంచి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. బాన్సువాడ ఎత్తిపోతల పథకం పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు పోచారం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సోమవారం పైప్‌లైన్‌ను పరిశీలించారు. పైపులైన్ వేసి చాలాకాలం కావడంతో అక్కడక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయని, కొత్తపైపు లైన్ ఏర్పాటు, మోటార్ల కోసం ప్రతిపాదనలు పంపామని పోచారం తెలిపారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలు ఎండకుండా చూసేందుకు పైపు లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. నిజాంసాగర్ నుంచి విడుదల చేసే నీటిని వృథా చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు మోహన్‌నాయక్, దాసరి శ్రీనివాస్, గులెపల్లి శంకర్, రైతులు రెంజర్ల సాయిలు, గొల్ల సాయిలు, నర్సగౌండ, అశోక్‌రెడ్డి, నగేష్, రాజు, సత్యపాల్‌రెడ్డి, రఘువీర్, ధనగారి రాజు, గులెపల్లి గంగాధర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలతో సత్సంబంధాలు

- కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయిచైతన్య
- అట్టహాసంగా ప్రారంభమైన విద్యుత్ సంస్థ హాకీ టోర్నీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ

నిజామాబాద్‌నాగారం: క్రీడాపోటీలతో ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ హాకీ టోర్నీని సీపీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతోపాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎంతో కష్టపడే విద్యుత్ ఉద్యోగుల్లో ఈ తరహా టోర్నీల నిర్వహణతో కొత్త ఉత్సాహం వస్తుందన్నారు. ఉద్యోగులు, సిబ్బందిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్న విద్యుత్‌సంస్థ సీఎండీ అభినందనీయులన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆపరేషన్ కామారెడ్డి శ్రావణ్ కుమార్, ఎస్ఈ ఓఎంసీ పీవీ రావు, అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, డీఈలు రమేశ్, విక్రమ్, టోర్నీ ఆర్గనైజర్, ఏడీఈ రాజశేఖర్, ఏఏవో గంగారాం నాయక్ పాల్గొన్నారు. మొదటిరోజు టోర్నీలో నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాల జట్లు తలపడ్డాయి.

ఖేలో ఇండియాకు అనూహ్య స్పందన



యోగాసన పోటీల్లో పాల్గొన్న వారితో జిల్లా యోగా అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు

కామారెడ్డి అర్బన్: జిల్లా యోగా భవన్‌లో సోమవారం నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా అండర్-18, 18 -55 కేటగిరిల్లో నిర్వహించిన యోగాసన సిటీ లీగ్-2025 కు అనూహ్య స్పందన లభించింది. 460 మంది పేర్లు నమోదు చేసుకోగా 419 మంది పోటీలకు హాజరయ్యారు. ఈ పోటీలకు అనూహ్య స్పందన వచ్చిందని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు యోగా రాంరెడ్డి తెలిపారు. మూడు కేటగిరీల్లో పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలను ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి జగన్నాథన్, జీసీడీవో సుకన్య, ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, యోగా అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి అనిల్‌రెడ్డి, యోగాచార్యులు జి.అంజయ్యగుప్తా, పి.అంజయ్య, ప్రతినిధులు బాస రఘుకుమార్, శ్రీలత, రాజ్‌కుమార్, లక్ష్మీరాజం, క్రీడల సాంకేతిక పరిశీలకులు జి.ప్రసాద్, ఏ.రమేష్, సిద్ధాగౌడ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

విజేతలు..

కొండేరి శివాని, సీహెచ్.హేమవంతిని, శ్రీహర్షిత, సీహెచ్.సహస్ర, బి.సింధూజ, పి.హారిక, భూక్య పుష్పలత, గడ్డం కవిత, బట్టు నిఖిత, కె.స్రవంతి.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇన్‌చార్జీల పాలన

- వేధిస్తున్న అధికారులు, సిబ్బంది కొరత
- పలు పోస్టులు ఖాళీ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



దోమకొండలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

దోమకొండ : సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 10 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, దోమకొండల్లో, నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్‌లో కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్‌లలో మాత్రమే రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌లు ఉన్నారు. బిచ్కుంద, బాన్సువాడ, దోమకొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ కార్యాలయాల్లో ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. దీనికి తోడు ఆయా కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, రికార్డు అసిస్టెంట్ల పోస్టులు కూడా చాలావరకు ఖాళీగా ఉన్నాయి. దీంతో కార్యాలయాల్లో తాత్కాలిక సిబ్బందితో రోజువారి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌తో పాటు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ డాటా ఆపరేటర్, రికార్డ్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు ఉండాలి. కానీ ఎక్కడా పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాలకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో దస్త్రాల వివరాలను అనధికారికంగా ప్రైవేట్ వ్యక్తుల సాయంతో ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తర్వాత డాక్యుమెంట్లను స్కానింగ్ చేసి వెంటనే అందించాల్సి ఉంది. కాని సిబ్బంది కొరతతో స్కానింగ్ కూడా ఆలస్యం అవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌లు, సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

దోమకొండలో..

దోమకొండలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు ఒక సీనియర్ అసిస్టెంట్, మరో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు అటెండర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌లు, రికార్డు అసిస్టెంట్ ఉండాలి. సబ్ రిజిస్ట్రార్ లేకపోవడంతో ఇన్‌చార్జీ పాలన సాగుతోంది. సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇద్దరు అటెండర్లు ఉండగా.. ఒకరిని డిప్యుటేషన్‌పై కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్‌తో పాటు రికార్డు అసిస్టెంటు పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

ఉన్నతాధికారులకు వివరించాం

ఉమ్మడి నిజామాబాద్‌జిల్లాలో ఐదుచోట్ల సబ్ రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా స్థానాలలో సీనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాం. కొన్నిచోట్ల సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు కూడా లేరు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– ప్రసూన, జిల్లా రిజిస్ట్రార్, నిజామాబాద్

డుమ్మాలు కుదరవిక!

వైద్యులు, సిబ్బంది డుమ్మాలకు చెక్ పెట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనిని అమలు చేసేందుకు ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



- వైద్య, ఆరోగ్యశాఖలో ముఖ గుర్తింపు హాజరు
- పీహెచ్‌సీలలో వైద్యుల నుంచి సిబ్బంది వరకు..
- ఇన్, అవుట్ హాజరు మొబైల్ యాప్ ద్వారానే నమోదు..
- అమలుకు కసరత్తు చేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి పీహెచ్‌సీలో గతంలో ఓ వైద్యురాలు విధులకు హాజరుకాకున్నా రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. మరో వైద్యురాలు ముందస్తుగానే రెండురోజుల సంతకాలు చేసి డుమ్మా కొట్టడంతో అధికారులు విచారణ జరిపించారు. ఇలా చాలా ఆస్పత్రులలో జరుగుతోంది. ఉదయం 10 దాటిన తర్వాత కూడా వైద్యులు రావడం లేదని, ఇలా వచ్చి అలా వెళ్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. డుమ్మాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు, సిబ్బందికి ముఖ గుర్తింపు హాజరు అమలు చేయాలని నిర్ణయించింది.

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక అర్బన్ హెల్త్ సెంటర్ ఉన్నాయి. వీటి పరిధిలో 329 సబ్ సెంటర్లున్నాయి. వైద్యులు 53 మంది, అలాగే స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఫార్మసిస్టులు, సిబ్బంది మరో 420 మందికిపైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికి ముఖ హాజరుకు సంబంధించిన మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ లింక్, ఐరిస్‌తో ఈ యాప్ ద్వారా ఎలా అటెండెన్స్ నమోదు చేయాలో అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి వద్ద నుంచే హాజరు వేసుకుందామనుకుంటే కుదరదు. యాప్ ద్వారా ఆస్పత్రి లొకేషన్‌లో, సబ్ సెంటర్‌ల హెడ్ క్వార్టర్స్‌లో మాత్రమే ముఖ హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది.

కాగా సోమవారం నుంచే నూతన విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేసినా చాలాచోట్ల సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది.

మెరుగైన వైద్య సేవలు అందుతాయి

జిల్లాలోని పీహెచ్‌సీలలో విధులు నిర్వహించే వైద్యుల నుంచి క్లాస్-4 ఉద్యోగుల వరకు అందరూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే అందరితో ఆ యాప్ డౌన్‌లోడ్ చేయించాం. నూతన హాజరు విధానాన్ని త్వరలోనే పూర్తిగా అమలు చేస్తాం. ఈ నూతన విధానం ద్వారా వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తారు. దీంతో ప్రజలకు మరింతగా మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

– చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హెచ్చరిక
- జుక్కల్ ఆస్పత్రి వైద్యులకు షోకాజ్ నోటీసులు



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమయపాలన పాటించకుండా, విధులను నిర్లక్ష్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హెచ్చరించారు. సీజన్ వ్యాధుల కాలం కావడంతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సోమవారం సాయంత్రం ఆయన సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. జుక్కల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్, డ్యూటీ డాక్టర్ విఠల్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులను నిర్లక్ష్యం చేసిన ఇద్దరికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మిని ఫోన్ ద్వారా ఆదేశించారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న దివ్యాంగురాలు

కామారెడ్డి క్రైం: దివ్యాంగులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. భిక్కనూరులోని పునరావాస కేంద్రానికి చెందిన దివ్యాంగులు తయారు చేసిన రాఖీలతో సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించి మొదటి రాఖీని కొనుగోలు చేసి దివ్యాంగులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలు కలెక్టర్‌కు రాఖీ కట్టింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, డీఆర్‌డీవో సురేందర్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన భోజనం పెట్టాలి



గాంధారి(ఎల్లారెడ్డి): విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంకు కోసం స్థలం, అనంతరం దుర్గానగర్ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రేణుక చౌహాన్ పాల్గొన్నారు.

న్యాయ విచారణ జరిపించాలి



భిక్కనూరు: సౌత్‌క్యాంపస్‌లో అశ్విని అనే విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై ప్రభుత్వం వెంటనే న్యాయవిచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. సమయానికి అంబులెన్స్, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నా అశ్విని మృతి చెందేది కాదన్నారు. యూనివర్సిటీల్లో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ప్రభుత్వం వీటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే అశ్విని తల్లిదండ్రులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఎమ్మార్పీఎస్ నేతలు లక్ష్మణ్ మాదిగ, దుప్పు రవి, బాబు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ

దోమకొండ: మండలంలోని లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ కార్డులను పూర్తి స్థాయిలో అందజేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. మండలానికి మొత్తం 1,841 కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. నూతన రేషన్ కార్డులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ సహకారంతో మంజూరైనట్లు వివరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, విండో మాజీ చైర్మన్ నర్సారెడ్డి, డైరెక్టర్ గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పరిష్కార మార్గాలు చూపాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 142 వినతులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం గానీ పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 142 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందిన భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవో వీణ, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జుక్కల్‌లో ఫిర్యాదులు నిల్

పిట్లం(జుక్కల్): ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం స్థానిక తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ రాజు నరేందర్ గౌడ్‌తో పాటు ఎంపీడీవో రఘు, వైద్య విస్తరణ అధికారి భూమయ్య మాత్రమే పాల్గొన్నారు. మిగిత శాఖల అధికారులు పాల్గొనలేదు. ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఇప్పించాలి..



రెండు నెలలు దాటినా పునాదుల వరకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రావడం లేదని దోమకొండ మండలం చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు వాపోయారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో 22 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా అధికారుల సూచన మేరకు పనులు చేపట్టామన్నారు. పునాదుల వరకు రూ.3 లక్షలకు పైగా ఖర్చు పెట్టామన్నారు. అన్ని పత్రాలను సమర్పించామన్నారు. మొదటి విడతగా రూ.లక్ష రావాల్సి ఉందన్నారు. గ్రామంలో ఒక్కరికి మాత్రమే డబ్బులు మంజూరు చేశారని తెలిపారు. అయినా రెండు నెలలుగా అధికారులు బిల్లులు మంజూరు చేయడం లేదని వాపోయారు. బిలుల్లు ఇప్పించాలని కోరుతూ ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు.

వేల ఎకరాల్లో అడవుల ఆక్రమణ..



గాంధారి మండలంలో వేల ఎకరాల అటవీ భూములు ఆక్రమణకు గురయ్యాయని మండలంలోని పెద్ద గుజ్జుల్ తండాకు చెందిన గిరిజన నాయకుడు నెనావత్ మోజీరాం నాయక్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఆయన మాట్లాడుతూ.. గతంలో జిల్లాలో ఎక్కడా లేని విధంగా గాంధారి మండలంలో అడవులు ఉండేవన్నారు. తాము కూడా గిరిజనులం అంటూ లబానా లంబాడాలు మండలంలోని వేల ఎకరాల అడవులను చదును చేసి ఆక్రమిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో తమకు కూడా పోడు పట్టాలు వస్తాయని భావిస్తూ యధేచ్ఛగా అడవుల నరికివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇదంతా నిత్యం అటవీ అధికారుల కళ్ల ముందరే జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అటవీ భూముల సమగ్ర సర్వే చేపట్టి లబానాల ఆధీనంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని గిరిజనులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు.

అద్దె బిల్లులు రాలేదు..



ప్రభుత్వ అధికారుల వద్ద నడిపే వాహనాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ హైర్ వెహికల్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణికి తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారుల వద్ద అద్దె విధానంలో వాహనాలు పెట్టుకుని నడిపిస్తున్నామని తెలిపారు. దాదాపు 15 నెలలకు సంబంధించి రూ.40 లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. 2023 జనవరి నుంచి జూన్ వరకు జరిగిన కంటి వెలుగు కార్యక్రమంలో సంతోషి ట్రావెల్స్ నుంచి ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించిన మరో రూ.6.28 లక్షల డబ్బులు ఇంకా రాలేదన్నారు. బిల్లులు రాక అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో మంగళవారం నిర్వహించే సమావేశానికి పింఛనుదారులు రావాలని పెన్షన్‌దారుల సంఘం నాయకులు సతీష్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నరని తెలిపారు. అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పద్మారావు తదితరులు ఉన్నారు.

వాహనం ఆర్సీ మార్పిడి ఇలా...

సమాచారం

కమ్మర్‌పల్లి/ఖలీల్‌వాడి: ఎవరి దగ్గర నుంచైనా పాత వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు ఆర్సీ (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్)ని మధ్యవర్తుల సాయం లేకుండానే మన పేరు మీదకి సులభంగా మార్చుకోవచ్చు. అందుకోసం కింద తెలిపిన పత్రాలు సమకూర్చుకోవాలి.

- ఫారం 29, వాహనం అమ్మిన వారు ఇచ్చే సమాచారం
- ఫారం 30, కొనుగోలుదారుడు దరఖాస్తు కోసం
- ఒరిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్
- పొల్యూషన్(పీయూసీ) ధ్రువీకరణ
- పాన్ కార్డు
- చాసిస్ నంబర్, ఇంజిన్ నంబర్, పెన్సిల్ ఇంప్రింట్
- చిరునామా ధ్రువీకరణ పత్రం (ఆధార్, ఓటరు కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు)
- క్రయ, విక్రయదారుల పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు
- రోడ్డు పన్ను చెల్లించిన రశీదు
- ఫారం 28 ఎన్‌వోసీ (వాహనం ఇతర రాష్ట్రాలకు చెందినది అయితే)
- ఫైనాన్స్ ఉన్న వాహనాలకు సదరు సంస్థ నుంచి ఎన్‌వోసీ ఫారం 35 అవసరం అవుతుంది.

వాహన యజమాని మరణిస్తే ఫారం 31 మరణ ధ్రువీకరణ పత్రం, వారసత్వ ధ్రువీకరణ పత్రం, వారసుల అఫిడవిట్ ఉండాలి. పై పత్రాలు సిద్ధంగా ఉంచుకొని ఆన్‌లైన్‌లో transport.telangana.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి నమోదు చేసుకోవాలి. వాహన నంబర్, చాసిస్ నంబర్, చివరి 5 అంకెలు, మొబైల్ నంబర్ నమోదు చేసుకోవాలి. ఓటీపీ ద్వారా ధ్రువీకరించాలి. అన్ని పత్రాలు అప్‌లోడ్ చేయాలి. సంబంధిత ఫీజు చెల్లించాలి. అనంతరం అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవాలి. ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకున్న దరఖాస్తుతోపాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన పత్రాలను అందించాలి. అక్కడ ఆర్టీఏ అధికారులు పత్రాలను పరిశీలించి మీ ఫొటో తీస్తారు. నంబర్ నిర్ధారించి, ధ్రువీకరణ అనంతరం కొత్త ఆర్సీ జారీ చేస్తారు. పూర్తి వివరాలకు రవాణా శాఖ హెల్ప్ లైన్ నంబర్ 040-23370081 ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



పాల్వంచలో మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి

మాచారెడ్డి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేయాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో ఏర్పాటు చేసిన బీజేపీ పోలింగ్ బూత్ సంపర్క్ అభ్యాస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మెజార్టీ వచ్చేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాల అధ్యక్షులు సురేష్, అనిల్, నేతలు శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డి తదివతరులు ఉన్నారు.

నస్రుల్లాబాద్: మైలారంలో బీజేపీ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ సంపర్క్ అభ్యాస్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా 137, 138, 148, 149 బూత్‌లలో గల కమిటీ సభ్యులు ప్రతి ఇంటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ బీజేపీ పథకాల గురించి వివరించారు. నేతలు వడ్ల సతీష్, హన్మాండ్లు, పవన్, లక్ష్మణ్, రామ్, శేఖర్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో పథకాలకు సంబంధించిన కరపత్రాలను బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, వెంకట్ రావు, రాజిరెడ్డి, దత్తాత్రేయ, రాజు, శ్రీకాంత్, నవీన్, శ్రీను,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి 12వ వార్డులో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు చిన్నోళ్ల రజనీకాంత్‌రావు ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. నేతలు పెద్దోళ్ల గోపాలరావు తదితరులు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులో సోమవారం క్షేత్రస్థాయిలో సోయా, పత్తి పంటలను పరిశీలించినట్లు ఏవో రాజలింగం తెలిపారు. సస్య రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలిపారు. సోయా, పత్తి పంటల్లో కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. కాండం తొలిచే పురుగు నివారణకు రైతులు హెమామెక్టిన్ బెంజాయిట్ 100 గ్రాములు, క్లోరాంతనిప్రోల్ 100 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పత్తిలో తయోమెతాక్సిన్ 100 మి.లీను హెమామెక్టిన్ బెంజాయిట్ 200 గ్రాములును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి వారానికి ఒకసారి పిచికారీ చేయాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నిజాంసాగర్(జుక్కల్): సైబర్ నేరాలతో యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై శివకుమార్ సూచించారు. సోమవారం నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో సైబర్ నేరాలు, షీటీం సేవలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా పోలీస్ బృందం ఆధ్వర్యంలో కళా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పిల్లలు తల్లిదండ్రుల మాట వినాలని, సెల్‌ఫోన్లకు బానిసై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. కళాబృందం సభ్యులు తిరుపతి, నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

కారు, ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

వేల్పూర్: మండలంలోని లక్కోర వద్ద 63 నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై సంజీవ్ మంగళవారం తెలిపారు. అంక్సాపూర్ నుంచి ఆర్మూర్‌కు ఆటోను ఆర్మూర్ నుంచి మోర్తాడ్ వైపు కారులో వెళ్తున్న జలందర్ అనే వ్యక్తి అతివేగంగా ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ఉన్న లింబాద్రి, ముత్తెన్నలకు బలమైన గాయాలైనట్లు పేర్కొన్నారు. లింబాద్రి కొడుకు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొలంలో పడి ఒకరి మృతి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం గోవిందపేట్ గ్రామంలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు పొలంలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సంతోష్ రామ్(35) తన భార్యతో కలిసి గోవిందపేట్‌లో నివాసముంటూ వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పొలం పని చేస్తుండగా మూర్ఛ రావడంతో బోర్లాపడి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

బోధన్: ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామ శివారులో పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన సిరిగంధపు శ్రీనివాస్(36) నీటమునిగి మృతి చెందాడు. ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపిన ప్రకారం.. పోచారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో చేపలు పట్టేందుకు వెళ్తున్నానని తండ్రికి చెప్పాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో సోమవారం చెరువులో ఆచూకీ కోసం వెతికారు. మధ్యాహ్న సమయంలో శ్రీనివాస్ మృతదేహం చెరువులో నీటిపై తేలింది. చేపల వల కాళ్లకు చుట్టుకొని, ఈత రాక నీటమునిగి మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



ఆర్మూర్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్(41) గత శుక్రవారం ఆలూరు మండలం మచ్చర్ల శివారులో బైక్‌పై వెళ్తుండగా అడవి పంది ఢీకొని కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రవీణ్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి సోమవారం చికిత్స పొందుతూ ప్రవీణ్ మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లైంగిక వేధింపులకు పాల్పడుతున్న గణేశ్ అనే లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదైంది. విద్యార్థిని పట్ల లెక్చరర్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలియడంతో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ సదరు కళాశాలలో నిరసన తెలిపి నిర్వాహకులను నిలదీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మహిళా ఎస్సై విచారణ చేపట్టగా లెక్చరర్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తేలింది. పోలీసులు లెక్చరర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీజీవీపీ నాయకుడు కల్యాణ్ కళాశాల ఎదుట ధర్నా చేశారు.

తెయూ సౌత్ క్యాంపస్‌లో విద్యార్థుల ధర్నా

- సమస్యల పరిష్కారానికి డిమాండ్
- ఆరు గంటలపాటు కొనసాగిన నిరసన
- రిజిస్ట్రార్ హామీతో ఆందోళన విరమణ



అశ్విని మృతదేహానికి నివాళులర్పిస్తున్న వార్డెన్ సునీత



ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

భిక్కనూరు: అందుబాటులో అంబులెన్స్, వైద్య సిబ్బంది ఉంటే పీజీ విద్యార్థిని అశ్విని మరణించి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తూ తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్‌లో విద్యార్థులు ధర్నా చేపట్టారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట ప్రారంభమైన ఆందోళన ఆరు గంటలపాటు కొనసాగింది. ప్రిన్సిపల్ సుధాకర్ గౌడ్‌తోపాటు పలువురు అధ్యాపకులు సముదాయించినా విద్యార్థులు శాంతించలేదు. వీసీ వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని మొండికేశారు. దీంతో ప్రిన్సిపాల్ ఈ విషయాన్ని రిజిస్ట్రార్ యాదగిరి, వీసీ యాదగిరిరావుల దృష్టికి తీసుకెళ్లారు. వీసీ అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రార్ యాదగిరి సౌత్‌క్యాంపస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సౌత్ క్యాంపస్‌లో హెల్త్‌కేర్ సెంటర్ లేకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులను విద్యార్థులు రిజిస్ట్రార్‌కు వివరించారు. క్యాంపస్‌లో సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ వర్సిటీ లేదా సీఎస్ఐఆర్ నిధుల నుంచి అంబులెన్స్‌ను కొనుగోలు చేసి క్యాంపస్‌కు పంపిస్తామన్నారు. వైద్యుడు లేదా వైద్య సిబ్బంది 24 గంటలపాటు ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. విద్యార్థుల ధర్నా నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అశ్వినికి ఘన నివాళి

సౌత్ క్యాంపస్‌లో ఆత్మహత్య చేసుకున్న అశ్వినికి సోమవారం పలువురు ఘన నివాళులర్పించారు. మృతదేహంపై పూలమాలలు వేసి కన్నీటి పర్యంతమయ్యారు. వార్డెన్ సునీత, అధ్యాపకులు ప్రతిజ్ఞ, సరితలు అశ్విని మృతదేహం వద్ద నివాళులర్పించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలు

- 13 ఏళ్ల శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి తీర్పు

నిజామాబాద్ లీగల్: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సెషన్స్ జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి పదముడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోపాల్ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన జల్లాపురం సాయికుమార్‌కు గాంధారి మండలం చద్మల్‌కు చెందిన మౌనికతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహమైన తర్వాత దంపతులిద్దరూ బాగానే ఉన్నా, మరో మహిళతో వివాహేతర సంబంధం వీరి కుటుంబంలో కలహాలు పుట్టించింది. ఇరువర్గాల పెద్దలు పలుసార్లు పంచాయితీ నిర్వహించి దంపతుల మధ్య రాజీ కుదిర్చారు. ఆ తర్వాత కొన్నాళ్లకు మౌనిక తల్లికి కల్యాణలక్ష్మి డబ్బుల మంజూరుకావడంతో ఆ డబ్బుల్లో తనకూ వాటా కావాలని సాయికుమార్ అడిగాడు. దీంతో ఇరువురి మధ్య మరోసారి గొడవ చోటుచేసుకుంది. దీంతో 28 ఆగస్టు 2023న మౌనిక తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మోపాల్ పోలీసులు మౌనిక భర్త సాయికుమార్, అత్త నవనీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి, భార్య ఆత్మహత్యకు కారణమైన సాయికుమార్‌కు 10 సంవత్సరాల జైలు విధించగా, భార్యను వేధించినందుకు మరో 3 సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది. కాగా, ఈ కేసులో మౌనిక అత్త నవనీతను కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజేశ్వర్ వ్యవహరించారు.

మట్కా నిర్వాహకులకు రెండు రోజులు..

బోధన్ టౌన్(బోధన్): మట్కా నిర్వహిస్తున్న ఇద్దరికి బోధన్ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ పట్టణంలోని గోశాల ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న ముజాహిద్ అలియాస్ ముజ్జు, మహ్మద్ సద్దాం హుస్సేన్‌లపై కేసు నమోదు చేసి సోమవారం బోధన్ కోర్టులోని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఎదుట హాజరుపర్చామన్నారు. ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తు తీర్పు వెలువరించారన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న దూప్‌సింగ్ అనే వ్యక్తికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరికి మూడేళ్లు..

నిజామాబాద్ లీగల్: దళితులను కులం పేరుతో దూషించి, వారిపై దాడి చేసిన ఇద్దరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఎస్సీ,ఎస్టీ కోర్టు న్యాయమూర్తి టీ శ్రీనివాస్ రావు సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట్ మండలం సలీంఫారం గ్రామానికి చెందిన మెగులపు సాయికృష్ణ, ఆయన కుమారుడు మెగులపు రవిచంద్ర, అదే గ్రామానికి చెందిన మదిర శారద ఇంటిపక్కన రోడ్డుపై ఉన్న బండరాయిని పొక్లెయిన్‌తో తొలగించారు. బండరాయిని తొలగించిన ప్రదేశంలో గుంత ఏర్పడటంతో ఆ గుంతను పూడ్చాలని శారద భర్త చిన్నయ్య, సాయికృష్ణ కుటుంబసభ్యులను కోరారు. గుంతను పూడ్చేందుకు వారు నిరాకరించడంతో చిన్నయ్య కుటుంబసభ్యులు దానిపై ముళ్లకంప ఉంచారు. కంప రోడ్డుకు అడ్డంగా ఉందని, దానిని తొలగించాలని సాయికృష్ణ కుటుంబసభ్యులు వారితో గొడవపడ్డారు. ఈ సందర్భంగా శారదతోపాటు వారి కుటుంబసభ్యులు, బంధువులను సాయికృష్ణ, అతని కుమారుడు రవిచంద్ర కులంపేరుతో దూషించి, దాడికి దిగారు. బాధితులు నవీపేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేసిన పోలీసులు, విచారణ నిమిత్తం నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టుకు అప్పగించారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి టీ శ్రీనివాస్ రావు, నిందితులు సాయికృష్ణ, అతని కుమారుడు రవిచంద్రలకు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.3,500 జరిమానా విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బంటు వసంత్ వ్యవహరించారు.